
సాక్షి
కాకినాడ


శుక్రవారం । 21 । మార్చి । 2025



మతాతీతంగా మాతకు ఆరాధన

దేవరపల్లి మండలం గౌరీపట్నంలోని నిర్మలగిరి పుణ్యక్షేత్రంలో మేరీమాత ఉత్సవాలు శనివారం ప్రారంభం కానున్నాయి. దీనికి అన్ని ఏరాట్లూ చేశారు.

8లో



సాగుకు నీటి విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గురువారం తూర్పు డెల్టాకు 3200, మధ్య డెల్టాకు 2 వేలు, పశ్చిమ డెల్టాకు 5,500 క్యూసెక్కుల చొప్పున గోదావరి జలాలను విడుదల చేశారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ శుక్రవారం (సాయంత్రం)	సహర్ శనివారం (ఉదయం)
రాజమండ్రి	6.22	4.46
కాకినాడ	6.23	4.45
అమలాపురం	6.23	4.45

న్యూస్‌రీల్

మహాశివరాత్రి ఆదాయం రూ 29.66 లక్షలు



హుండీల ఆదాయం లెక్కిస్తున్న భక్తులు

సామర్లకోట: మహాశివరాత్రి సందర్భంగా స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరీ సమేత కుమారారామ భీమేశ్వర స్వామి ఆలయానికి రూ.29,66,406 ఆదాయం సమకూరిందని ఈఓ బళ్ల నీలకంఠం తెలిపారు. గత ఏడాది డిసెంబర్ 6 నుంచి మార్చి 20 వరకూ ఆలయంలో హుండీల ద్వారా వచ్చిన ఆదాయాన్ని గురువారం లెక్కించారు. హుండీల ద్వారా రూ.16,15,788 ఆదాయం వచ్చిందని ఈఓ తెలిపారు. 67 గ్రాముల బంగారు, 600 గ్రాముల వెండి వస్తువులు లభించాయని ఈఓ తెలిపారు. ఫిబ్రవరి 24 నుంచి మార్చి 1 వరకూ దర్శనం టిక్కెట్ల ద్వారా రూ.7,05,960, వివిధ సేవా టిక్కెట్ల ద్వారా రూ.65,747, ప్రసాద విక్రయాల ద్వారా రూ.2,66,215, అన్నదాన విరాళాలు రూ.3,12,696 వచ్చాయని వివరించారు. హుండీల ద్వారా గత ఏడాది కంటే రూ.6 లక్షలు అదనంగా ఆదాయం వచ్చిందని ఈఓ తెలిపారు. దేవదాయ శాఖ తనిఖీదారు ఫణి కుమార్ పర్యవేక్షణలో హుండీల లెక్కింపు జరిగింది. ఉత్సవ కమిటీ చైర్మన్ కంటే బాబు, ఆలయ సూపరింటెండెంట్ ఈశ్వరరావు, మానవ హక్కుల సంఘం అధ్యక్షుడు నూతలపాటి అప్పలకొండ, ఆర్యవైశ్య సంఘం, భక్త సంఘం, ఉండూరు లక్ష్మీనారాయణ సేవా సంఘం సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

ఈవీఎంల భద్రతకు పటిష్ట చర్యలు

కాకినాడ సిటీ: ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ (ఈవీఎం), వీవీ ప్యాట్‌ల భద్రతకు పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ వద్ద ఉన్న ఈవీఎం గోదామును ఆయన గురువారం పరిశీలించారు. అక్కడి భద్రతా చర్యలు అడిగి తెలుసుకున్నారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి నెలా ఈవీఎంల గోదామును పరిశీలించి, నివేదిక పంపిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. అలాగే, ప్రతి మూడు నెలలకోసారి జిల్లాలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో గోదామును పరిశీలిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీఆర్వో జె.వెంకటరావు, జిల్లా అగ్నిమాపక అధికారి పీవీఎస్ రాజేష్, కాకినాడ అర్బన్ తహసీల్దార్ వి.జితేంద్ర, కలెక్టరేట్ ఎన్నికల విభాగం డీటీ ఎం జగన్నాథం, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

కొత్త కోవెల @ 13 వసంతాలు

- నేడు 14వ సంవత్సరంలోకి అడుగు
- సత్యదేవునికి ఘనంగా పూజలు
- 2011లో నూతన ఆలయ నిర్మాణం



నూతన ఆలయ శిఖర ప్రతిష్ఠ చేస్తున్న జయేంద్ర సరస్వతి. చిత్రంలో అప్పటి దేవస్థానం చైర్మన్ ఐవీ రామ్‌కుమార్, ఈఓ రామచంద్ర మోహన్ తదితరులు (ఫైల్)



నూతన ఆలయాన్ని పునర్నిర్మిస్తున్న శ్రమజీవులు

అన్నవరం: భక్తవరదుడైన సత్యదేవుని నూతన ఆలయం 13 వసంతాలు పూర్తి చేసుకొని శుక్రవారం 14వ వత్సరంలోకి అడుగిడుతోంది. ఈ సందర్భంగా రత్నగిరి ఘనంగా వేడుకలు నిర్వహించనున్నారు. సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేయనున్నారు.

సత్యదేవుని ఆవిర్భావం

శతాబ్దానికి పైబడిన చరిత్ర సత్యదేవుని సొంతం. అప్పటికి అన్నవరం ఓ కుగ్రామం. ఆ రోజుల్లో రత్నగిరిపై దట్టమైన అడవి ఉండేది. 1891లో ఖర నామ సంవత్సర శ్రావణ శుద్ధ విదియ ముందు రోజు రాత్రి అప్పటి గోర్స ఎస్టేట్ జమీందార్ అయిన రాజా ఇనుగంటి వేంకట రామారాయణం కలలో సత్యదేవుడు ప్రత్యక్షమయ్యారు. తాను అన్నవరంలోని రత్నగిరిపై వెలిశానని, తనకు ఆలయం కట్టించాలని చెప్పారు. అన్నవరం గ్రామానికి చెందిన ఈరంకి ప్రకాశరావుకు కూడా ఇదేవిధంగా కల వచ్చింది. దీంతో వారిద్దరు, మరికొంత మంది గ్రామస్తులు కలిసి రత్నగిరిపై సత్యదేవుని కోసం వెతికారు. అన్నవరం గ్రామ దేవత నేరేళ్లమ్మ తల్లి ఆలయం పక్కన ఉన్న కొండ మీద అంకుడు చెట్టు కింద స్వామివారి విగ్రహం దర్శనమిచ్చింది. దీంతో తొలుత చిన్న పందిరి నిర్మించి ఆ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఆ తరువాత చిన్న ఆలయం, మరి కొన్నాళ్లకు పెద్ద ఆలయాన్ని రెండంతస్తుల్లో నిర్మించారు. కింది అంతస్తులో మహా నారాయణ యంత్రాన్ని విష్ణు పంచాయతనంతో ప్రతిష్ఠించారు. మధ్యలో సత్యదేవుడు, ఎడమ వైపు అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారు, కుడివైపు లింగాకారంలో పరమేశ్వరుడు ఈ ఆలయంలోనే 2011 వరకూ భక్తులకు భక్తులకు దర్శనమిచ్చారు.

నూతన ఆలయ నిర్మించారిలా..

పాత ఆలయం శిథిలావస్థకు చేరడంతో నూతన ఆలయాన్ని నిర్మించాలని 2011లో అప్పటి కార్యనిర్వహణాధికారి, ప్రస్తుత దేవదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్ సంకల్పించారు. దీనికి అప్పట్లో చాలా అడ్డంకులు ఎదురయ్యాయి. కొంత మంది పాత ఆలయం తొలగించడానికి వీలు లేదని హైకోర్టును, సుప్రీంకోర్టును ఆశ్రయించినా ఫలితం దక్కలేదు. నూతన ఆలయ నిర్మాణం సుమారు ఏడాది పాటు సాగింది. మూలవిరాట్టులపై టేకు చెక్కతో తయారు చేసిన పెద్ద పెట్టెను ఉంచి, దానిపై ఇనుప గడ్డర్లతో రక్షణ ఏర్పాటు చేసి, పాత ఆలయాన్ని తొలగించారు. తమిళనాడులోని నమ్మక్కల్ గ్రానైట్ క్వారీల నుంచి సేకరించిన శిలలతో పాత ఆలయం మాదిరిగానే రెండంతస్తుల్లో నూతన ఆలయ నిర్మాణం జరిగింది. ఈ నిర్మాణం జరిగిన న్నాళ్లూ సత్యదేవుడు, అమ్మవారు, శంకరుల ఉత్సవ మూర్తులను ధ్వజస్తంభం వద్ద బాలాలయంలో ఉంచి పూజలు నిర్వహించారు.

జయేంద్ర సరస్వతి చేతుల మీదుగా..

నూతన ఆలయ శిఖరంపై కలశ స్థాపన కార్యక్రమాన్ని 2012 మార్చి 14, ఫాల్గుణ బహుళ సప్తమి నాడు కంచి కామకోటి పీఠాధిపతి జగద్గురు జయేంద్ర సరస్వతి స్వామి చేతుల మీదుగా శాస్త్రోక్తంగా నిర్వహించారు. అప్పటి నుంచి తెలుగు తిథుల ప్రకారం ఏటా ఫాల్గుణ బహుళ సప్తమి నాడు నూతన ఆలయ వార్షికోత్సవం నిర్వహిస్తున్నారు.



సత్యదేవుని నూతన ఆలయం

నేడు ప్రత్యేక పూజలు

నూతన ఆలయ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం తెల్లవారుజామున సత్యదేవుడు, అమ్మవారికి, శంకరులకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. బూరెలు, పులిహోర, రవ్వకేసరి ప్రసాదాలు నివేదించి, భక్తులకు పంపిణీ చేస్తారు. అలాగే, స్వామివారి కదంబ ప్రసాదం కూడా పంపిణీ చేస్తారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని స్వామివారి ఆలయాన్ని, ఆలయ ప్రాంగణాన్ని సర్వాంగ సుందరంగా అలంకరిస్తున్నారు.

అటకెక్కిన 'స్వర్ణ' ప్రాజెక్ట్

సత్యదేవుని ఆలయ శిఖరానికి బంగారు రేకు తాపడం చేయాలనే ప్రతిపాదన ఆరు నెలలుగా కాగితాలకే పరిమితమైంది. ఈ ప్రతిపాదనపై అంచనాలు రూపొందించాలని గత ఏడాది టీటీడీని కోరారు. దీనికి 50 కిలోలకు పైగా బంగారం అవసరమవుతుందని టీటీడీ నిపుణులు ప్రాథమిక నివేదిక సమర్పించారు. ప్రస్తుతం బంగారం ధరతో పోల్చితే ఇది దేవస్థానానికి సాధ్యం కాదు. దీంతో రాగి రేకుపై బంగారు కోటింగ్‌తో చేయించేందుకు నివేదిక ఇవ్వాలని అప్పటి ఈఓ కె.రామచంద్ర మోహన్ కోరారు. ఆయన గత నవంబర్‌లో కమిషనర్ కార్యాలయానికి బదిలీ అయ్యాక దీనిని ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా దీనిపై చర్యలు తీసుకుని, దాతల విరాళాలతో ఆలయ శిఖరాన్ని స్వర్ణ రేకు తాపడం చేయించాలని భక్తులు కోరుతున్నారు.

వెండి గరగ సమర్పణ



వెండి గరగను అందిస్తున్న దాతలు

తాళ్లరేవు: ఇంజరం గ్రామ దేవత పరదేశమ్మ వారికి వట్టెం మల్లిబాబు, గౌరీ రాజ్యలక్ష్మి దంపతులు రూ.1.25 లక్షలతో తయారు చేయించిన వెండి గరగను గురువారం సమర్పించారు. అమ్మవారి జాతర ఈ నెల 28న జరగనున్న నేపథ్యంలో కిలో వెండితో దీనిని తయారు చేయించి ఆలయానికి అందజేశారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

విఘ్నేశ్వరునికి రూ.25.32 లక్షల ఆదాయం



హుండీల ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామి ఆలయంలో హుండీల ఆదాయాన్ని దేవదాయ, ధర్మదాయ శాఖ పర్యవేక్షణాధికారి, ఆలయ తనిఖీదారు జంపా రామలింగేశ్వరరావు ఆధ్వర్యాన గురువారం లెక్కించారు. 51 రోజులకు గాను హుండీల ద్వారా రూ.25,32,263 ఆదాయం లభించిందని ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. 14 విదేశీ కరెన్సీ నోట్లు లభించాయన్నారు.

వీర మహిళపై కేసు

పిఠాపురం: జనసేన నేతలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ సోషల్ మీడియాలో ప్రచారం చేశారంటూ ఆ పార్టీ వీర మహిళపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. ఇటీవల జరిగిన జనసేన ఆవిర్భావ సభకు సంబంధించి టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్, జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాస్‌లను ఉద్దేశించి వీర మహిళ సుజాత అనుచిత వ్యాఖ్యలు చేస్తూ సోషల్ మీడియాలో పోస్టింగ్‌లు పెట్టారు. పార్టీ నేతలు అక్రమ సంబంధాలు కొనసాగిస్తున్నారని పేర్కొంటూ, పార్టీ ఆవిర్భావ దినోత్సవం నాడు జ్యోతిప్రజ్వలన చేసిన తీరుపై మండిపడుతూ నాయకులపై అనుచిత వ్యాఖ్యలతో హల్‌చల్ చేశారు. ఆమెపై పిఠాపురం సీఐ శ్రీనివాస్‌కు జనసేన నేతలు రెండు రోజుల క్రితం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు గురువారం రాత్రి పిఠాపురం ఆర్టీసీ బస్ కాంప్లెక్స్ వద్ద ఉన్న సుజాత ఇంటికి అరెస్టు చేయడానికి వెళ్లారు. అప్పటికే రాత్రి కావడంతో వెనుదిరిగారు. అయితే ఆమెను ఎందుకు అరెస్టు చేయలేదంటూ జనసేన నేతలు సీఐ కార్యాలయం వద్దకు వెళ్లి పోలీసులను నిలదీశారు.

స్టేషన్‌కు వచ్చే వారితో మర్యాదగా మాట్లాడాలి

కాకినాడ క్రైం: స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదీలు, ఇతరులతో మర్యాద ఇచ్చి మాట్లాడాలని ఎస్పీ బిందు మాధవ్ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన నేర సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళలు, బాలికలకు సంబంధించి వస్తున్న ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలన్నారు. శక్తి యాప్‌ను వారి సెల్ ఫోన్లలో ఇన్‌స్టాల్ చేయించి, హెల్ప్‌లైన్ నంబర్లు ప్రదర్శించాలని సూచించారు. వేసవిలో రాత్రి వేళ నేరాలు అధికంగా జరిగే అవకాశం ఉన్నందున అప్రమత్తం కావాలని అన్నారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. సాంకేతికతను ఉపయోగించి కేసులు ఛేదించే వారిని ఏబీసీడీ అవార్డుకు సిఫారసు చేస్తామని చెప్పారు. చైన్ స్నాచింగ్‌ను నియంత్రించాలన్నారు. రౌడీ షీటర్ల రికార్డులు ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని సూచించారు. మాదక ద్రవ్యాల నియంత్రణపై తగిన చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో సీసీ కెమెరాల నిఘా తప్పకుండా ఉండాలని స్పష్టం చేశారు. రహదారి భద్రతపై సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఏలేశ్వరం బంగారం దుకాణం చోరీ కేసును ఛేదించిన, గొల్లపాలెం స్టేషన్ పరిధిలో అనుమానాస్పద వ్యక్తి నుంచి తుపాకులు స్వాధీనం చేసుకుని నేరాన్ని కట్టడి చేసిన అధికారులను, సిబ్బందిని ఎస్పి అభినందించారు.



గొల్లపాలెం హెడ్ కానిస్టేబుల్ సీహెచ్‌వీ నారాయణరెడ్డిని అభినందిస్తున్న ఎస్పీ బిందుమాధవ్

స్వచ్ఛ ఓటర్ల జాబితాకు సహకరించాలి

కాకినాడ సిటీ: జిల్లాలో స్వచ్ఛమైన ఓటర్ల జాబితా తయారీకి సహకరించాలని రాజకీయ పార్టీల ప్రతినిధులను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షణ్మోహన్ కోరారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలోనే కాకుండా ముందుగానే ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణ, మార్పులు, చేర్పులు, ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనల వంటి అంశాలపై చర్యలకు భారత ఎన్నికల సంఘం ఆదేశించిందని తెలిపారు. ఈ మేరకు సూచనలు, సలహాలు అందించాలని కోరారు. రాజకీయ పార్టీలు బూత్ స్థాయి ఏజెంట్లను నియమించాలన్నారు. అన్ని నియోజకవర్గాల్లోనూ బూత్ స్థాయి అధికారులను (బీఎల్‌వో) నియమించి, ఏప్రిల్ 15 నాటికి అందరికీ శిక్షణ పూర్తి చేస్తామని చెప్పారు. జిల్లావ్యాప్తంగా ఏడు అసెంబ్లీ నియోజకర్గాల్లోని 1,640 పోలింగ్ కేంద్రాల్లో 16,36,916 మంది ఓటర్లు ఉన్నారన్నారు. ప్రతి వెయ్యి నుంచి 12 వందల మంది ఓటర్లున్న పోలింగ్ కేంద్రాలను గుర్తించి విభజించనున్నామన్నారు.

పోలింగ్ కేంద్రం ఓటర్లకు రెండు కిలోమీటర్లకు మించి దూరంగా ఉండకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. సమావేశంలో డీఆర్వో వెంకటరావు, కలెక్టరేట్ ఎన్నికల విభాగం అధికారి ఎం.జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

అక్షర దీప్తి.. చైతన్య స్ఫూర్తి

- మనిషిలో మనీషిని పరిచయం చేస్తున్న కవులు
- గోదారి నేలపై కవితా వాహిని
- సామాజిక సమస్యలపై స్పందిస్తున్న కవులెందరో..

అద్దం అరచేతిలో ఇమిడిపోయేదే అయినా.. ఆకాశాన్ని చూపిస్తుంది. చూడటానికి చిన్నగానే కనిపించినా.. జాబిల్లి జగతికి చల్లని వెలుగులను పంచుతుంది. పుస్తకం చిన్నదే అయినా మస్తిష్కానికి వికాసాన్నిస్తుంది. అక్షరం చిన్నదే అయినా నిత్య చైతన్య దీప్తిని, స్ఫూర్తిని నింపుతుంది. కవితా వాహినిగా మారి.. మనిషి లోపల దాగున్న అసలు మనిషిని నిత్యం పరిచయం చేస్తుంది. అర్థం చేసుకునే మనసుతో చదివితే.. నడవడికలో లోపాలను చక్కదిద్ది మనిషిని మనీషిగా చక్కదిద్దుతుంది. మానవ సమాజాన్ని మరో ప్రపంచ వైపు నడిపిస్తుంది.

ఇదీ నేపథ్యం

ఐక్యరాజ్య సమితి విద్యా, శాస్త్రీయ, సాంస్కృతిక సంస్థ మార్చి 21వ తేదీన ప్రపంచ కవితా దినోత్సవం నిర్వహించాలని 1999లో ప్రకటించింది. ఈ నేపథ్యంలో భాషా వైవిధ్యానికి మద్దతు పలికేందుకు, అంతరించిపోతున్న భాషలను ప్రోత్సహించేందుకు, కవిత్వాన్ని ప్రోత్సహించేందుకు 27 ఏళ్లుగా కృషి సాగుతోంది.

కపిలేశ్వరపురం: గోదారి నేలపై పేద, మధ్యతరగతి ప్రజల జీవితాలనే వస్తువుగా స్వీకరించి ఎంతో మంది కవులు అపార సాహిత్యాన్ని సృజించారు. సమాజోద్ధరణకు శ్రమించారు. ఆవంత్స సోమసుందర్, బోయి భీమన్న, అద్దేపల్లి రామమోహనరావు, దాట్ల దేవదానంరాజు వంటి ప్రముఖులతో పాటు.. ఎంతో మంది కవులు ప్రపంచం నలుమూలలా సామాజిక, రాజకీయ, ఆర్థిక సమస్యలకు గురైన పీడితులపై ద్రవించిన హృదయంతో స్పందించారు. నేడు ప్రపంచ కవితా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..

నేడు ప్రపంచ కవితా దినోత్సవం

గోదారి తీరాన కవిచంద్రులు

- పిఠాపురంలోని శ్రీ విశ్వ విజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠం 6వ అధిపతి కవిశేఖర డాక్టర్ ఉమర్ ఆలీషా విశేషంగా సాహిత్యాన్ని సృజియించారు. 1885 ఫిబ్రవరి 28న ఆయన జన్మించారు. మాతృ భాష కానప్పటికీ తెలుగులో అద్భుతమైన సాహిత్యాన్ని సృష్టించారు. ఈ ఏడాది ఫిబ్రవరి 28న కాకినాడలో ఆయన జయంతి ఘనంగా నిర్వహించారు.
- దేవులపల్లి కృష్ణశాస్త్రి సామర్లకోట మండలం చంద్రపాలెంలో 1897 నవంబరు 1న జన్మించారు. లలిత గీతాలు, నాటికలు, సినిమా పాటలు రాసి, ఎంతో ఖ్యాతి పొందారు. భావ కవిత్వానికి పెట్టింది పేరు.
- 'బలం కలవాడు పులి, తెలివి కలవాడు నక్క, ఈ ఇరువర్గాలకో ఆహారంగా బతుకుతున్న వర్గాలు గొర్రెలు' అంటూ చైతన్యపూరిత మాటలు రాసిన బోయి భీమన్న కోనసీమ జిల్లాలోని మామిడికుదురులో 1911 సెప్టెంబర్ 19న జన్మించారు. సామాజిక చైతన్యాన్ని ఆశించి రచనలు చేసి, తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన కవి, రచయిత. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు, పద్మభూషణ్‌తో పాటు లెక్కకు మిక్కిలిగా సన్మానాలందుకున్నారు. అంటరానితనం వంటి దురాచారాలను నిరసించారు.
- 1924 నవంబర్ 18న కాకినాడ జిల్లా శంఖవరంలో పుట్టిన ఆవంత్స సోమసుందర్ సాహిత్య రంగంలో అవిరళ కృషి చేశారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా నాడు సాగిన ఉద్యమానికి మద్దతుగా ఆయన రచించిన 'వజ్రాయుధం' కవిత ఎంతో మందిని ఉత్తేజపరచింది.
- కాకినాడకు చెందిన అద్దేపల్లి రామమోహనరావు జిల్లా నలుమూలలా సాహిత్య సభలు, సమావేశాలు, కవి సమ్మేళనాలు నిర్వహించేవారు. తుది శ్వాస విడిచిన 2016 వరకూ సాహిత్య కృషి చేశారు. 'అయినా ధైర్యంగానే' పేరుతో అద్దేపల్లి రాసిన కవితలు సామాన్యుడి జీవన స్థితిగతులను తడుముతాయి.
- యానాంలో నివసిస్తున్న ప్రముఖ కవి, కథకుడు దాట్ల దేవదానం రాజు. అభ్యుదయవాది అయిన ఆయన అనేక కథలు, కవితా సంపుటాలు వెలువరించారు. 'యానాం చరిత్ర' వంటి గ్రంథాలను వెలువరించారు. అనేక పురస్కారాలు అందుకున్నారు.
- పిఠాపురానికి యువ రచయిత డాక్టర్ కిలారి గౌరి నాయుడు 40 జాతీయ అంతర్జాతీయ సదస్సులు, విశ్వ విద్యాలయాల్లో నిర్వహించిన సదస్సుల్లో తన కవితలను వినిపించారు. రాచకొండ నరసింహ శర్మ సాహితీ సంస్థ ఉపాధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. సాహిత్యంపై పరిశోధనకు గాను అప్పటి గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్నారు.
- పిఠాపురానికి చెందిన ర్యాలి ప్రసాద్ తెలుగు సాహిత్యంలో సాహిత్యంలో విశేష కృషి చేస్తున్నారు. పెద్దాపురం వైభవం, కాకినాడ చరిత, కోనసీమ చరిత్ర, పిఠాపుర చరిత్రలను కవితాత్మకంగా చెప్పారు. పశ్చిమ జర్మనీలోని తెలుగు భారతి, సాంస్కృతిక వేదిక నిర్వహించిన అంతర్జాతీయ అనుభూతి కవితల పోటీలో ప్రథమ బహుమతి అందుకున్నారు.



బండారులంకలో కవులకు నివాళి అర్పిస్తున్న కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పెనుగొండ తదితరులు (ఫైల్)



అద్దేపల్లి రామమోహన రావు (ఫైల్)



ఆవంత్స సోమసుందర్ (ఫైల్)



బోయి భీమన్న



దేవులపల్లి కృష్ణశాస్త్రి

కొరవడిన ప్రభుత్వ ప్రోత్సాహం

ప్రచార మాధ్యమాలు పెరిగిన ప్రస్తుత తరుణంలో సాహిత్యం మరింతగా అందుబాటులోకి వస్తోంది. తెలుగు భాషపట్ల ఆసక్తి ఉన్నవారు కవితలు, కథలు రాసేందుకు ముందుకొస్తున్నారు. అయితే వారికి ప్రభుత్వ పరంగా ప్రోత్సాహం అందడం లేదు. స్వశక్తితో తమ కవిత్వాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కవులు అనేక వ్యయప్రయాసలు ఎదుర్కొంటున్నారు.

సాహితీ 'గోదారి'

- 'కవిత కోసమే నేను పుట్టాను.. క్రాంతి కోసము కలము పట్టాను.. ఎండమావులు చెరిపి.. పండు వెన్నెల నిలిపి.. గుండె వాకిలి తలుపు తట్టాను' అన్న ఆరుద్రను సత్కరించిన ప్రాంతం రాజమహేంద్రవరం.
- అద్దేపల్లి రామమోహనరావు పేరిట అద్దేపల్లి ఉదయ భాస్కరరావు కన్వీనర్‌గా 'అద్దేపల్లి సాహిత్య వేదిక'ను నిర్వహిస్తున్నారు. ఏటా సాహిత్య పురస్కారాలు అందజేస్తున్నారు. గత ఏడాది సెప్టెంబర్ 8న రాజమహేంద్రవరానికి చెందిన 'ప్రాణహిత' కవి సాహితీవేత్త సన్నిధానం నరసింహశర్మకు 'అద్దేపల్లి సాహిత్య పురస్కారం 2024'ను కాకినాడలో అందజేశారు.
- కొత్తపేటలో కళాసాహితి పేరుతో 37 ఏళ్లుగా సాహిత్య కృషి సాగిస్తున్నారు. 1989 నుంచి క్రమం తప్పకుండా ఉగాది రోజున కవి సమ్మేళనం నిర్వహిస్తున్నారు. గత ఏడాది ఏప్రిల్ 7న నిర్వహించిన కార్యక్రమంలో కవి గిడ్డి సుబ్బారావును సత్కరించారు.
- కోనసీమకు చెందిన శ్రీశ్రీ కళావేదిక గత ఏడాది ఏప్రిల్ 7న అమలాపురంలో 132వ ఉగాది జాతీయ శతాధిక కవి సమ్మేళనం నిర్వహించగా పలు రాష్ట్రాల నుంచి 132 మంది కవులు పాల్గొన్నారు. 2024 సెప్టెంబర్ 21న కాకినాడలో 137వ జాతీయ కవి సమ్మేళనం నిర్వహించారు.
- రాజానగరం సమీపంలోని ఆదికవి నన్నయ యూనివర్సిటీలో గత ఏడాది మార్చి 16న కవి కుసుమ ధర్మన్న 125వ జయంతి సందర్భంగా కవితా గోష్ఠి నిర్వహించారు.
- గత ఏడాది ఏప్రిల్ 14న బండారులంకలో నిర్వహించిన అభ్యుదయ రచయితల సంఘం (అరసం) జిల్లా మహాసభలో ప్రతిభ చూపిన కవులను ఇటీవల కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు అందుకొన్న పెనుగొండ లక్ష్మీనారాయణ సత్కరించారు.
- కాకినాడకు చెందిన డాక్టర్ జోస్యుల కృష్ణబాబు పేరుగాంచిన పుస్తకాలకు సమీక్షలు రాస్తున్నారు.
- ఈ ప్రాంతానికి చెందిన ఎంతో కవులు వివిధ ప్రతిష్ఠాత్మక సంస్థల నుంచి పురస్కారాలు అందుకుంటున్నారు.

కవుల సంఖ్య విస్తృతమైంది



ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో కవితలు రాసేవారి సంఖ్య పెరిగింది. ఆధునిక సాంకేతికత పెరిగిన నేపథ్యంలో ప్రాచుర్యం పొందిన కవితల పుస్తకాలు అందుబాటులోకి వస్తున్నాయి. వాటిని అధ్యయనం చేస్తూ కవితలు రాసేందుకు యువత ఆసక్తి చూపుతున్నారు. వచన కవిత్వం ప్రాచుర్యంలో ఉంది. కాకినాడ, పెద్దాపురం తదితర ప్రాంతాల్లోని యువ కవులను ప్రోత్సహిస్తున్నాం. సామాన్యుల జీవన శైలినే కవితా వస్తువుగా తీసుకుని కవితలు రాయడం ద్వారా సమాజంలో ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేయవచ్చు.

– అద్దేపల్లి ప్రభు, కవి, కాకినాడ

క్రమం తప్పకుండా..



యానాం వేదికగా కవి సంధ్య, స్ఫూర్తి సాహితీ సమాఖ్య సంయుక్త ఆధ్వర్యంలో ఏడేళ్లుగా క్రమం తప్పకుండా ప్రపంచ కవితా దినోత్సవం నిర్వహిస్తున్నాం. కార్యక్రమ విస్తృతి ఆవశ్యకత నేపథ్యంలో ఈ నెల 23న హైదరాబాద్‌లో నిర్వహించనున్నాం. ఆధునిక కాలంలో సైతం కవిత్వ రచన పట్ల ఆసక్తి పుష్కలంగా ఉంది. అయితే పదబంధాలు, మెళకువలు నేర్పే యంత్రాంగం అందుబాటులో లేదు. సామాజిక పరిస్థితులను అర్థం చేసుకుంటూ ప్రాచీన సాహిత్యాన్ని అధ్యయనం చేస్తూండాలి. పఠనాసక్తి పెంపొందించేందుకు కృషి చేయాలి.

– దాట్ల దేవదానం రాజు, కవి, తెలుగు విశ్వ విద్యాలయం కీర్తి పురస్కార గ్రహీత, యానాం

సామాన్యుల జీవితాలే కవితా వస్తువు



ప్రపంచ కవితా దినోత్సవం సందర్భంగా మండపేటలో అరసం, సంగమం వేదిక సంయుక్త ఆధ్వర్యాన శుక్రవారం కవి సమ్మేళనం నిర్వహిస్తున్నాం. మనిషి శ్రమ నుంచి సాహిత్యం పుట్టింది. శ్రమకు విలువ ఉన్నంత కాలం కవిత్వానికి ప్రాధాన్యం తప్పనిసరిగా కొనసాగుతుంది. ప్రస్తుత కాలంలో యువతీ యువకులు సాహిత్య కృషిపై ఆసక్తి చూపుతున్నారు.

– డాక్టర్ చల్లా రవికుమార్, సంగమం వేదిక నిర్వాహకుడు, మండపేట

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 - 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 - 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	15,500
గటగట (వెయ్యి)	14,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	14,500
గటగట (వెయ్యి)	13,500
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,000 - 13,500
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	13,000 - 13,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

క్లుప్తంగా

కువైట్‌లో గుండెపోటుతో యువకుడి మృతి



చింతా సాగర్ (ఫైల్)

సఖినేటిపల్లి: మండల పరిధిలోని గొంది గ్రామానికి చెందిన చింతా సాగర్(34) ఈ నెల 18వ తేదీన గుండెపోటుతో కువైట్‌లో మృతి చెందారు. 19వ తేదీన ఆ దేశం నుంచి కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. సాగర్‌కు భార్య, ఒక బాబు ఉన్నారు. సేఠ్ వద్ద కారు డ్రైవర్‌గా మొదటిగా 2022లో గల్ఫ్ వెళ్లారు. రెండేళ్ల అనంతరం స్వగ్రామం వచ్చిన సాగర్, గత జూలైలో తిరిగి రెండో దఫా గల్ఫ్ వెళ్లారు. ఎన్నో ఆశలతో బతుకు తెరువు కోసం కువైట్ వెళ్లి ఎప్పటి మాదిరిగానే మళ్లీ తిరిగి వచ్చి తమను కలుస్తారు అనుకుంటున్న కుటుంబ సభ్యులు జరిగిన ఘటనతో కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. చిన్న వయసులోనే తమకు అందనంత దూరాలకు వెళ్లిపోవడం జీర్ణించుకోలేక పోతున్నామని రోదిస్తున్నారు. మృతదేహం శనివారం నాటికి స్వగ్రామానికి రానున్నట్లు స్థానికులు తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

నిడదవోలు రూరల్: మండలంలోని పురుషోత్తపల్లి గ్రామంలో వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు సమిశ్రగూడెం ఎస్సై కె.వీరబాబు గురువారం తెలిపారు. పురుషోత్తపల్లికి చెందిన యడ్ల మధుసాగర్ ఈ నెల 15వ తేదీన శనివారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని భార్య షేక్ చాందిని ఇచ్చిన ఫిర్యాదుపై మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.



విద్యుత్ దీపకాంతులతో ముస్తాబైన నిర్మలగిరి మేరీమాత పుణ్యక్షేత్రం



గౌరీపట్నం వద్ద నిర్మలగిరి పుణ్యక్షేత్రంలో క్రీస్తు దేవాలయం

మతాతీతంగా మాతకు ఆరాధన

- రేపటి నుంచి నిర్మలగిరి మేరీ మాత ఉత్సవాలు
- సుందరంగా ముస్తాబైన పుణ్యక్షేత్రం
- అఖండ దేవాలయం సిల్వర్ జూబ్లీ ఉత్సవాలు
- అగ్ర పీఠాధిపతుల రాక
- 10 లక్షల మంది భక్తుల వచ్చే అవకాశం
- వివిధ ప్రాంతాల నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు



గౌరీపట్నం నిర్మలగిరి పుణ్యక్షేత్రంలోని అఖండ దేవాలయం

దేవరపల్లి: ఉభయగోదావరి జిల్లాల్లో ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందింది నిర్మలగిరి పుణ్యక్షేత్రం. ఇక్కడి మేరీ మాతను నిత్య నిష్కళంక మాతగా, మత భేదమెరుగని తల్లిగా అన్ని మతాల వారు ఆరాధిస్తున్నారు. ఈ నెల 22 నుంచి 25 వరకు మేరీ మాత ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు ఏలూరు పీఠాధిపతి జయరావు పొలిమెర పర్యవేక్షణలో పుణ్యక్షేత్రం డైరెక్టర్ ఫాదర్ ఎస్.జాన్‌పీటర్, ఉత్సవాల నిర్వహణ కమిటీ, సహాయక ఫాదర్లు ఏర్పాట్లు చేస్తున్నారు. దేవరపల్లి మండలం గౌరీపట్నం గ్రామానికి ఆనుకుని ఈ క్షేత్రం ఉంది. క్షేత్రం ఆవిర్భావానికి 1978లో అప్పటి ఏలూరు పీఠాధిపతి జాన్ ములగాడ నాంది పలకగా పలువురు ఫాదర్లు పుణ్యక్షేత్రం అభివృద్ధికి పాటుపడ్డారు. ప్రస్తుత డెరెక్టర్ ఫాదర్ జాన్‌పీటర్ పుణ్యక్షేత్రాన్ని సర్వాగ సుందరంగా తీర్చిదిద్దారు. కులమతాలకు అతీతంగా భక్తులు మేరీమాతను దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటున్నారు. ఉత్సవాలకు రాష్ట్ర నలుమూలల నుంచి అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చి తమ కోర్కెలను మరియతల్లికి విన్నవించుకుంటారు.

1978లో బిషప్ జాన్‌ములగాడ గౌరీపట్నంలో నిర్మలగిరి క్షేత్రాన్ని నిర్మించాలని సంకల్పించారు. 1976లో ఏలూరు బలిపీఠం ఏర్పడింది. జాన్ ములగాడ తొలి పీఠాధిపతిగా నియమితులయ్యారు. అనంతరం బిషప్ ములగాడ కారులో విశాఖపట్నం వెళుతుండగా గౌరీపట్నం వద్ద కారు మరమ్మతులకు గురైయింది. కారు దిగి జాన్‌ములగాడ చుట్టూ పరిశీలించారు. ఎత్తైన కొండలు, కారు చీకటి, ముళ్లపొదలతో నిండి ఉన్న చిట్టడవి. భయంకర వాతావరణం. అంతలోనే ములగాడ మనసులో ప్రేరణ. ఈ ప్రాంతంలో ఆలయం నిర్మించవా అంటూ ప్రేరణ కలిగింది. కారు మరమ్మతులు చేయించుకుని విశాఖపట్నం బయలుదేరారు. 1978లో గౌరీపట్నం ప్రాంతంలో మేరీమాత ఆలయం నిర్మణానికి సంకల్పం చేశారు. 1979లో ఆలయ నిర్మాణం చేసి ఫాదర్ మైకేల్‌ను తొలి డైరెక్టర్‌గా నియమించారు.1982 నుంచి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. 1992లో ఫాదర్ దిరిసిన ఆరోన్ పుణ్యక్షేత్రం డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. 1995లో పుణ్యక్షేత్రంలో ఆధ్యాత్మిక ప్రశాంత వాతావరణం కల్పించడానికి ప్రేమసేవా ఆశ్రమం ఏర్పాటు చేశారు.

2000లో అఖండ దేవాలయం నిర్మాణం

క్షేత్రంలో అఖండ దేవాలయం నిర్మాణానికి 1992లో శంకుస్థాపన చేశారు. 2000లో ఆలయ నిర్మాణం పూర్తి చేశారు. ఒకేసారి దాదాపు 5,000 మంది ప్రార్థనలు చేసుకొనేందురు వీలుగా దేవాలయం నిర్మించారు. క్షేత్రంలో కళాత్మకంగా పలు కట్టడాలను ఏర్పాటు చేశారు.

ప్రేమ సేవా ఆశ్రమం

1995 జూలైలో ప్రేమసేవా ఆశ్రమాన్ని నిర్మలగిరిలో నెలకొల్పారు. మఠవాసులను తీర్చిదిద్దే బాధ్యత జేసురాజన్ చేపట్టారు. బ్రహ్మచర్య వ్రత నియమాలు పాటిస్తూ ప్రభువు సువార్తను ప్రకటించే పరిచర్య ఇక్కడే ఆరంభమవుతుంది. సేవ చేయాలనే ఉత్సాహం ఉన్న యువతీ, యువకులు ఏడాది పాటు మఠంలో ఉండవచ్చును. 1997లో నిర్మల హృదయ మహిళా కళాశాలను బిషప్ ములగాడ ప్రారంభించారు.

అనురాగ ఆశ్రమం ఏర్పాటు

నిర్మలగిరి 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా పుణ్యక్షేత్రానికి ఎదురుగా సుమారు 100 అడుగుల ఎత్తున సుందరమైన క్రీస్తు మందిరాన్ని నిర్మాణం చేశారు. చరిత్రలోని వివిధ ఘట్టాలను కళాత్మకంగా గోపురంలో పొందుపర్చారు.

నిత్య అన్నదానం

పుణ్యక్షేత్రానికి నిరంతరం వస్తున్న భక్తులకు నిత్య అన్నదానం చేస్తున్నారు. ప్రతి రోజు సుమారు 2 వేల మంది భక్తులకు ఉచితంగా అన్నదానం చేస్తున్నారు. అన్నదానం కాంట్రాక్టర్ కోళ్ళ నాగేశ్వరరావు పర్యవేక్షణలో జరుగుతుంది.

ఏటా మార్చిలో ఉత్సవాలు

ఏటా మార్చి 22 నుంచి 25 వరకు మేరీమాత ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండడంతో పుణ్యక్షేత్రంలోని పలు ప్రదేశాల్లో నిఘా కెమెరాలను ఏర్పాటు చేశారు. భక్తుల రక్షణకు భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తారు. మతాలకు అతీతంగా భక్తులు ఉత్సవాల్లో పాల్గొని కొబ్బరికాయలు కొట్టి, కొవ్వొత్తులను వెలిగించి, తలనీలాలు సమర్పించి దైవదూత అనుగ్రహం కోసం ప్రార్థిస్తారు. ఉత్సవాల్లో భాగంగా దివ్య బలిపూజలు, దివ్య సత్ప్రసాద ఆరాధనలు నిర్వహిస్తారు. వాటికన్ భారత రాయబారి, ఫ్రాన్సిస్ మోస్ట్ రెవరెండ్ లియోపోల్డో జిరెల్లి పుణ్యక్షేత్రంలో 2022లో జరిగిన ఉత్సవాల్లో పాల్గొని ప్రార్థనలు చేశారు. ఉత్సవాలకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులు నడుపుతున్నారు.

25న అగ్ర పీఠాధిపతుల రాక

ఉత్సవాల ముగింపు సందర్భంగా అగ్ర పీఠాధిపతులు ఈ నెల 25న పుణ్యక్షేత్రానికి వచ్చి పూజా కార్యక్రమంలో పాల్గొంటారని నిర్మలగిరి డైరెక్టర్ రెవ. ఫాదర్ జాన్‌పీటర్ తెలిపారు. 25న ఏలూరు, విశాఖ అగ్ర పీఠం అపోస్తోలిక పాలనాధికారి జయరావు పొలిమెర, మద్రాస్‌లోని మైలాపూర్ అగ్రపీఠాధిపతి జార్జి ఆంతోని స్వామి, ఖమ్మం పీఠాధిపతి సగిలి ప్రకాష్, నల్గొండ, కర్నూల్, నెల్లూరు పీఠాధిపతులు కరణం ధమన్ కుమార్, గోర్తట్ల జ్వానేస్, పిల్ల అంతోని దాస్, దివ్యబలిపూజలో పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈ ఏడాది ఉత్సవాల్లో అఖండ దేవాలయం నిర్మాణం చేసి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా సిల్వర్ జూబ్లీ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

సీలింగ్ భూములు ఎస్సీ, ఎస్టీలకు పంచాలి

జైపాల్ సింగ్ ముండాకు ఆదివాసి మహాసభ నివాళులు



సమావేశంలో మాట్లాడుతున్న సూర్యనారాయణ తదితరులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): రాష్ట్రంలో భూసంస్కరణలు అమలు చేసి సీలింగ్ చట్ట ప్రకారం 50 శాతం భూమి ఎస్సీ, ఎస్టీలకు పంపిణీ చేయాలని ఆదివాసీ మహాసభ డిమాండ్ చేసింది. భారత రాజ్యాంగ సభ సభ్యులు, ఆదివాసీ మహాసభ వ్యవస్థాపకుడు జైపాల్ సింగ్ ముండా 55వ వర్ధంతి సందర్భంగా గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్ లో జరిగిన మీడియా సమావేశంలో ఆయనకు ఆదివాసీ మహాసభ తరపున ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆదివాసి మహాసభ న్యాయ సలహాదారు అయినాపురపు సూర్యనారాయణ మాట్లాడుతూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 34,348 ఎకరాల సీలింగ్ మిగులు భూములు ఉన్నాయని, వాటిలో 15,500 ఎకరాల పంపిణీ జరిగిందన్నారు. సుమారు 18,848 ఎకరాలు కోర్టు వివాదాలలో ఉన్నాయన్నారు. వై.ఎస్.రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా ప్రారంభించిన భూ పంపిణీ కార్యక్రమంలో సీలింగ్ భూములు వెయ్యి ఎకరాలు పంచారన్నారు. ఇప్పటికైనా తూర్పుగోదావరి జిల్లా, కాకినాడ జిల్లా, కోనసీమ జిల్లా అల్లూరి సీతారామరాజు జిల్లాల కలెక్టర్లు బాధ్యత వహించి సీలింగు భూములన్నీ వేరే పార్టీకి రిజిస్ట్రేషన్ జరుగకుండా 22ఎ నోటిఫికేషన్ జారీ చేయాలని ఆదివాసీ మహాసభ డిమాండ్ చేస్తోందన్నారు. నాయకులు జక్కల పాండవులు, సభ్యులు గూన అప్పన్న, అర్జున, మల్లేశ్వరి పాల్గొన్నారు.

రిలయన్స్ మార్ట్‌పై కేసు నమోదు



రిలయన్స్ మార్ట్‌ను తనిఖీలు చేస్తున్న అనంతరావు, లీగల్ మెట్రాలజీ అధికారి శ్యామూల్‌రాజు

రాజమహేంద్రవరం సిటీ: నగరంలోని పుష్కర్ ఘాట్ వద్ద గల రిలయన్స్ మార్ట్ పై వచ్చిన ఫిర్యాదు ఆధారంగా గురువారం లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ శామ్యూల్ రాజు ఆధ్వర్యంలో అధికారులు తనిఖీలు నిర్వహించారు. తయారీ తేదీ, గడువు తేదీని ట్యాంపర్ చేసినట్లు గుర్తించి కేసు నమోదు చేశారు. వినియోగదారులు వస్తువుల కొనుగోలు సమయంలో ప్యాకేజీ ఎక్స్‌పెయిరీ డేట్, ఎంఆర్పీ ధరను పరిశీలించాలని జిల్లా వినియోగదారుల రక్షణ మండలి సభ్యుడు గొట్టిముక్కల అనంతరావు విజ్ఞప్తి చేశారు. ఎంఆర్పీ కన్నా అధిక ధరలకు విక్రయించినా, యూజ్ బై డేట్ ముగిసినవి అమ్మినా లీగల్ మెట్రాలజీ అధికారులకు తెలియజేయాలని కోరారు. ఈ తనిఖీలో పాల్గొన్న అనంతరావు మాట్లాడుతూ వినియోగదారులు తగిన జాగ్రత్తలతో మెలగాలని, ఫిర్యాదులు ఉంటే వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు. ఇటువంటి వ్యవహారాలపై అధికారులు కేసు నమోదు చేస్తారని తెలిపారు.

ఆలిండియా ఖోఖో జట్టుకు తులసి ఎంపిక



పెదపూడి: జి.మామిడాడ గ్రామంలో జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల్లో గ్రేడ్-2 ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న కోరుమిల్లి తులసి ఆలిండియా సివిల్ సర్వీసెస్ గేమ్స్ జాతీయ స్థాయి ఖోఖో జట్టుకు క్రీడాకారిణిగా ఎంపికయ్యారు. ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్తి వెంకటరెడ్డి గురువారం మాట్లాడుతూ ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ గేమ్స్ మీట్‌లో ఆంధ్రప్రదేశ్ తరఫున ఖోఖో జట్టుకు క్రీడాకారిణిగా ప్రాతినిధ్యం వహించనున్నారన్నారు. ఆమె ఈ నెల 19 నుంచి 24 వరకు ఢిల్లీలో జరుగుతున్న పోటీల్లో పాల్గొంటున్నారన్నారు. ఆమె 2024 నవంబర్7న విజయవాడలో జరిగిన ఖోఖో పోటీల్లో ఉత్తమ ప్రతిభతో జాతీయ జట్టులో స్థానం సంపాదించారని తెలిపారు. ఆమెను పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

గేట్‌లో శ్రీగౌతమ్‌కు నాలుగో ర్యాంక్



పెదపూడి: జి.మామిడాడ గ్రామానికి చెందిన పోతురాజు శ్రీగౌతమ్ బుధవారం విడుదలైన గేట్-2025 ఫలితాల్లో కెమికల్ ఇంజినీరింగ్ విభాగంలో ఆల్‌ఇండియాలో నాలుగో ర్యాంక్ సాధించాడని తండ్రి సాయి వెంకటేశం తెలిపారు. ఆయన గురువారం జి.మామిడాడలో మాట్లాడుతూ సెంట్రల్ గవర్నమెంట్‌లో మంచి ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో పట్టుదలగా చదివాడన్నారు. సంవత్సరం నుంచి చేస్తున్న ఉద్యోగానికి ఐదు నెలల క్రితం రాజీనామా చేసి ఇంటికి వచ్చాడన్నారు. ఈ ఐదు నెలలుగా ఇంటి వద్ద ఉండి ప్రణాళిక బద్ధంగా చదివి ఈ ర్యాంక్ సాధించాడన్నారు. తల్లి గృహిణి కాగా తాను పైన గ్రామంలో ఎస్జీటి ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నానని తండ్రి తెలిపారు.

వాసుకు పదో ర్యాంకు



అమలాపురం రూరల్: అమలాపురం రూరల్ మండలం బండారులంక చెందిన చేనేత కుటుంబానికి చెందిన పిచ్చిక కుమార్ వాసు గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజినీరింగ్ (గేట్)-2025 ఫలితాల్లో పదో ర్యాంకు సాధించాడు. జాతీయస్థాయిలో వాసు మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంలో 10 ర్యాంకు సాధించడంతో బండారులంకలో చేనేత కార్మికులు గురువారం బాణసంచా కాల్చి సంబరాలు చేశారు. చేనేత కార్మికులైన పిచ్చిక మల్లేశ్వరరావు, రేణుక వాణీ కుమారుడు వాసు కష్టపడి రెండుసార్లు గేట్ రాసి ఈ ర్యాంకు సాధించాడు. 1 నుంచి 4వ తరగతి వరకు బండారులంక విజడమ్ స్కూలులో చదివి, భూపతిపాలెం గురుకుల పాఠశాలలో 10 తరగతి పూర్తి చేసి రాజమహేంద్రవరం శ్రీచైతన్యలో ఇంటర్మీడియెట్, నర్సారావుపేట జేఎన్టీయూలో బీటెక్ పూర్తిచేశానని వాసు తెలిపాడు. ఐఐటీ, ఎన్ఐటీలో ఎంటెక్ పూర్తిచేసి మంచి ఇంజినీరుగా దేశానికి సేవలు అందిస్తానని అన్నాడు. గ్రామస్తులు వాసు తల్లిదండ్రులను ఊరేగించి వీరభద్రస్వామి ఆలయం వద్ద సత్కరించారు. శ్రీశైలం దేవస్థానం మాజీ ట్రస్టీ చింతా శంకర మూర్తి, టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పిచ్చిక శ్యామ్, ఉప్పుగుంటి భాస్కరరావు బళ్ల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కోటనందూరు: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామకృష్ణ గురువారం తెలిపారు. అనకాపల్లి జిల్లా నాతవరం మండలం చినగొలుగొండేకు చెందిన కాళ్ల వెంకటేశ్వర్లు(59) డీజిల్ తెచ్చుకునేందుకు టీవీఎస్ మోపెడ్‌పై కోటనందూరు బయలుదేరాడు. అల్లిపూడిలో బర్ల వరలక్ష్మికి లిఫ్ట్ ఇవ్వడం కోసం బండి ఎక్కించుకున్నాడు. అల్లిపూడి-కాకరాపల్లి రోడ్డులో జీడిపిక్కల ఫ్యాక్టరీ దగ్గరకు వచ్చేసరికి ఎదురుగా ధాన్యం లోడుతో వేగంగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. వెంకటేశ్వర్లు అక్కడికక్కడే మృతి చెందగా, వరలక్ష్మికి తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను 108 అంబులెన్స్‌లో నర్సీపట్నంలో ఆసుపత్రికి తరలించారు. ట్రాక్టర్ డ్రైవర్ వేగంగా నడపడం వల్లే ప్రమాదం జరిగిందని కుటుంబ సభ్యులు ఆరోపించారు. మృతుడి కుమార్తె బొడ్డు నారాయణమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అమలాపురం జెడ్పీ హైస్కూల్‌కు 150 ఏళ్లు

- వచ్చే ఆగస్టులో ఉత్సవాల నిర్వహణకు సన్నాహాలు
- పూర్వపు విద్యార్థి, ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు



పూర్వ విద్యార్థులతో సమావేశమైన ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు

అమలాపురం టౌన్: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్థాపించి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా వచ్చే ఆగస్టు నెలలో ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆ పాఠశాల పూర్వపు విద్యార్థి, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు తెలిపారు. 1876లో ఈ పాఠశాలను స్థాపించారని పేర్కొన్నారు. పాఠశాల భవనాలు 1863లో నిర్మితమైనట్లు, ఈ ప్రదేశంలో గుర్రపుశాల, పెద్ద గంటతో చర్చి , పలు భవనాలు, ఖాళీ స్థలంతో ఉండేదని అప్పటి కలెక్టర్ పెడరిక్ రికెట్స్ హెమింగ్ తమ గెజిటీర్‌లో ప్రచురించారని ఎమ్మెల్సీ గుర్తు చేశారు. 1876లో ఆ స్థలం, భవనాలు ఉన్నత పాఠశాలగా మార్పు చెందాయని పేర్కొన్నారు. పాఠశాల 150 సంవత్సరాల ఉత్సవాలను పలువురు ప్రముఖులు, పూర్వ విద్యార్థులతో ఘనంగా నిర్వహించాలనుకుంటున్నామని చెప్పారు. ఈ పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులు ఎక్కడున్నా ఫోన్ల నంబర్లు పంపించాలని ఎమ్మెల్సీ విజ్ఞప్తి చేశారు. పాఠశాలకు సంబంధించి మీ దగ్గర పొటోల రూపంలో జ్ఞాపకాలు, పాఠాలు చెప్పిన ఉపాధ్యాయుల పేర్లు ఉంటే వాటిని కూడా పంపించాలని కోరారు. 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ముద్రించే సావనీర్‌లో వాటిని పొందపరిచాలని నిర్ణయించామని తెలిపారు. పూర్వ విద్యార్థుల వివరాలు, సమాచారాన్ని 63052 08010 ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయాలని ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు విజ్ఞప్తి చేశారు. కొంతమంది పాఠశాల పూర్వ విద్యార్థులు స్థానిక జెడ్పీ ఉన్నత బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల క్రీడా స్థలంలో ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు అధ్యక్షతన గురువారం ఉదయం సమావేశమై 150 సంవత్సరాల ఉత్సవాల నిర్వహణపై చర్చించారు.

కన్న బిడ్డలను కాలువలో తోసేసిన తండ్రి లొంగుబాటు

- మీడియా ముందుకు తీసుకుని వచ్చిన పోలీసులు
- అప్పుల బాధతోనే అఘాయిత్యానికి పాల్పడినట్లు వెల్లడి



నిందితుడిని మీడియాకు చూపుతున్న పోలీస్ అధికారులు, సిబ్బంది

రామచంద్రపురం రూరల్: కన్న బిడ్డలను తండ్రే కాలువలోకి తోసేసి ఊపిరి తీయాలని చూసిన ఘటన పాఠకులకు తెలిసిందే. ఈ సంఘటనలో ఏడేళ్ల కుమార్తె కారుణ్యశ్రీ మృతి చెందగా, 10 ఏళ్ల కుమారుడు రామ సందీప్ ప్రాణాలతో బయట పడ్డాడు.. ఆ తరువాత అతడు కూడా ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని అందరూ భావించారు. పోలీసులూ అదే కోణంలో కాలువలు, గోదావరిలో గాలించారు. దీనికితోడు నిందితుడు పిల్లి రాజు ఉపయోగించే స్కూటర్ యానాం బ్రిడ్జిపై లభించడంతో గోదావరిలో దూకేశాడని మరింత తీవ్రంగా గోదావరిలో బోట్లు వేసుకుని గాలించారు. అయితే అనూహ్యంగా అతడు మండపేట రూరల్ పోలీస్ స్టేషన్‌లో బుధవారం లొంగిపోయాడు. దీంతో రామచంద్రపురం డీఎస్పీ బి.రఘువీర్ గురువారం తన కార్యాలయంలో ప్రెస్‌మీట్ పెట్టి నిందితుడిని మీడియా ముందుకు తీసుకువచ్చారు. డీఎస్పీ మాట్లాడుతూ అప్పుల ఒత్తిడితోనే తాను చనిపోతే తన పిల్లలు అనాథలు అయిపోతారని భావించి ముందుగా పిల్లలను నెలపర్తిపాడు శివారు గణపతి నగరం వద్ద పంట కాలువలోకి తోసేసి, తానూ ఆత్మహత్య చేసుకోవడానికి యానాం గోదావరి బ్రిడ్జిపై నుంచి దూకేయాలని వెళ్లాడని, అయితే అక్కడ మనసు మార్చుకొని రాథేయపాలెంలో బంధువుల ఇంటికి వెళ్లాడు. బంధువులు పోలీసులకు లొంగిపోవాలని సూచించడంతో మండపేట రూరల్ పోలీస్ స్టేషన్‌లో బుధవారం వెళ్లి లొంగిపోయాడు. ప్రెస్‌మీట్‌లో రామచంద్రపురం సీఐ ఎం.వెంకటనారాయణ, ద్రాక్షారామ ఎస్సై ఎం.లక్ష్మణ్, రామచంద్రపురం ఎస్సై ఎస్.నాగేశ్వరరావు, కె.గంగవరం ఎస్సై ఎస్‌కే జానీబాషా, సర్కిల్ సిబ్బంది పాల్గొన్నారు.

రైలు నుంచి జారి పడి మహిళ మృతి



సుభాష్మిత దాసు (పాత చిత్రం)

సామర్లకోట: ఒడిశాకు చెందిన ఒక యువతి బెంగళూరు నుంచి భువనేశ్వర్ వెళుతున్న ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ నుంచి గురువారం జారి పడి మృతిచెందిన సంఘటన ఇది. ఏసీ బోగీలో ప్రయాణం చేస్తున్న సుభాష్మిత దాసు (33) జి. మేడపాడు సమీపంలో బోగీ నుంచి పడిపోయింది. దీనిని గమనించిన ప్రయాణికులు వెంటనే రైలు చైన్ లాగారు. డ్రైవర్, గార్డులు రైలు నుంచి మహిళ పడిపోయిన విషయాన్ని సామర్లకోట స్టేషన్ మేనేజరు ఎం.రమేష్‌కు సమాచారం ఇచ్చారు. సుభాష్మిత కొన ఊపిరితో ఉన్న విషయాన్ని తెలుసుకొని వెనుక వస్తున్న సరార్ ఎక్స్‌ప్రెస్‌లో మహిళను ఎక్కించి సామర్లకోట తీసుకురావాలని మేడపాడులోని రైల్వే సిబ్బందికి సూచించారు. ఈ మేరకు స్టేషన్ మేనేజరు 108కు సామర్లకోట రైల్వే స్టేషన్‌కు వచ్చే విధంగా సమాచారం ఇచ్చారు. సర్కార్ ఎక్స్‌ప్రెస్‌లో సామర్లకోట చేరిన మహిళను పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు 108 సిబ్బంది నిర్ధారించారు. జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆమె థర్డ్ ఏసీలో ప్రయాణం చేస్తున్నట్లు స్టేషన్ మేనేజరు తెలిపారు. సుభాష్మిత మృతిపై పూర్తి స్థాయిలో విచారణ చేయాలని విజయవాడ డీఆర్ఎం కార్యాలయం నుంచి సూచనలు వచ్చినట్లు తెలిసింది.